సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



రోడ్డెక్కిన రైతులు

నిత్యం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతుండటంతో రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. 10లో▸



బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. 10లో▸



వాస్తు.. విజయోస్తు

వాస్తు నమ్మకం ఎవరినీ వదలడంలేదు. రాజకీయ నేతలు సైతం వాస్తు చూసుకొనే ఏ పనైనా ప్రారంభిస్తున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ వద్ద అదనపు కలెక్టర్, రాజకీయ పార్టీల నాయకులు

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని మేరియే నాట్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను గురువారం అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంలు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వరాదని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, బీఆర్ఎస్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ధైర్యంగా ఓటు వేయాలి

- ఎస్పీ కోటిరెడ్డి
- వికారాబాద్‌లో పోలీసు కవాతు



పోలీసు కవాతులో పాల్గొన్న ఎస్పీ కోటిరెడ్డి, ఏఎస్పీలు, సిబ్బంది

అనంతగిరి: ప్రజలు ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. గురువారం వికారాబాద్‌లో సాయుధ సరిహద్దు దళం -3 కంపెనీ పోలీసులు, జిల్లా రిజర్వు సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధంతో సమానమని, దాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రవీందర్‌రెడ్డి, మురళీధర్, డీఎస్పీలు నర్సింలు, విజయ్, వీరేష్, ఇన్‌స్పెక్టర్లు రాజు, శ్రీను, వెంకటేశం, ఆర్ఐ సూరపు రాయుడు, అంజాద్ పాషా, సాయుధ దళం అసిస్టెంట్ కమాండర్ పవన్ పహాన్, ఇన్‌స్పెక్టర్లు సహదేవ్, సంతోష్, మెడికల్ ఆఫీసర్ అతిఖాఫ్ర జీనా తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.5 లక్షలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదుతో ఎస్‌ఐ

పూడూరు: మండలంలోని మన్నేగుడలో గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. గుల్షన్ హోటల్ వద్ద చన్గోముల్‌కు చెందిన ఖాన్ దావూద్ ఖాన్‌ను తనిఖీ చేయగా అతని వద్ద ఓ ప్లాస్టిక్ కవర్‌లో రూ. 5 లక్షలు నగదు లభించిందని ఎస్‌ఐ గిరి తెలిపారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రూ. 2.49 లక్షలు పట్టివేత



పట్టుబడిన నగదుతో సీఐ రాజేందర్ రెడ్డి

తాండూరు టౌన్: పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద గురువారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ. 2.49 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి కథనం మేరకు.. ఇందిరా చౌక్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి వద్ద రూ. 1,12,600, మరో వ్యక్తి వద్ద రూ. 1,36,800 ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల సిబ్బందికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

29న చిలుకూరు బాలాజీ ఆలయం మూసివేత

మొయినాబాద్: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఈ నెల 29న చిలుకూరు బాలాజీ ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. 29వ తేదీ తెల్లవారుజాము 1.05 నుంచి 2.22 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుందన్నారు. 8గంటల ముందుగానే ఆలయాన్ని మూసి వేస్తామన్నారు. 29న ఆలయాన్ని శుద్ధి చేసి ఉదయం 7గంటల తరువాత భక్తులకు స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తామన్నారు.

లెక్క తప్పొద్దు



అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై పక్కా నిఘా

- నిత్యం ఖర్చు వివరాలు సమర్పించాల్సిందే
- అభ్యర్థి నేర చరిత్ర, ఆస్తుల వివరాలు విధిగా తెలియజేయాలి
- మార్గదర్శకాలు విడుదల చేసిన ఈసీ
- ఒక్కో అభ్యర్థి వ్యయ పరిమితి రూ.40 లక్షలు
- అంతకు మించితే చర్యలే..
- జిల్లా వ్యాప్తంగా 13 చెక్‌పోస్టులు

వికారాబాద్: రోజురోజుకూ పెరిగిపోతున్న ఎన్నికల వ్యయాన్ని నియంత్రించడానికి కేంద్ర ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరిస్తోంది. అభ్యర్థి ఖర్చులకు సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేయడంతో వాటిని అమలు చేయడానికి కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఎన్నికల ఖర్చుకు సంబంధించిన నియమ నిబంధనలు నవంబర్ 9వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటికే పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు డబ్బు అక్రమ రవాణాను నియంత్రించడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 13 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.

రోజువారీ లెక్కలు ఇవ్వాల్సిందే

అసెంబ్లీ బరిలో నిలిచే అభ్యర్థి నామినేషన్ వేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయరాదు. గత ఎన్నికల్లో ఈ మొత్తం రూ.28 లక్షలు ఉండగా ఈ సారి రూ.40 లక్షలకు పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఏయే పద్దు కింద ఎంత ఖర్చు చేయాలనే విషయాలను కూడా స్పష్టం చేసింది. గతంలో ఎన్నికల ఖర్చును మూడు రోజులు లేదా వారానికి ఒక్కసారి, లేదా పోలింగ్ ప్రక్రియ పూర్తయి కౌంటింగ్ జరిగే నాటికి చూపిస్తే సరిపోయేది. కానీ ప్రస్తుత ఎన్నికల్లో ఆ పరిస్థితి లేదు. అభ్యర్థి చేసే ఖర్చు ఏ రోజుకు ఆ రోజు విధిగా చూపించాలన్న నిబంధన అమల్లోకి వచ్చింది. ఖర్చు వివరాల ప్రతులను నిత్యం జిల్లా ఎన్నికల అధికారికి విధిగా పంపాలి. అంతే కాకుండా ఈ వివరాలను ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధానాధికారి వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్న షరతు విధించింది. అంతేకాకుండా అభ్యర్థులకు నేర చరిత్ర ఉంటే అఫిడవిట్‌లో వాటి వివరాలు కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అభ్యర్థి నేరచరిత్రకు సంబంధించిన వివరాలను నామినేషన్‌తో అఫిడవిట పొందుపరచాలని సూచిస్తున్నారు.

జర జాగ్రత్త..

పెరిగిపోతున్న ఎన్నికల వ్యయాన్ని నియంత్రించాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ గట్టి చర్యలు చేపట్టింది. అభ్యర్థులు నిబంధనలకు లోబడే ఖర్చు చేయాలని ఆదేశాలు జారీ చేస్తోంది. ఈ సారి ఎన్నికల్లో ధన వ్యయాన్ని తక్కువ చేయాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ నిబంధనలను పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టింది. అయితే అభ్యర్థులు మాత్రం ఇప్పటికే లోలోన ఖర్చులు మొదలు పెట్టారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, బీజేపీ అభ్యర్థులను ప్రకటించలేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నిత్యం వాహనాలు, భోజనాలు, మందు, విందు కోసం భారీగానే ఖర్చు చేస్తున్నారు. ఎంతలేదన్నా ఆయా నియోజకవర్గంలోని అభ్యర్థులు ప్రతి మండలంలో నిత్యం లక్షల్లో ఖర్చు చేస్తున్నట్లు సమాచారం . దీంతో అభ్యర్థులు ఖర్చు లెక్కల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయా పార్టీలు తమ అభ్యర్థులకు ఇప్పటికే సూచించినట్లు తెలుస్తోంది.



బసిరెడ్డిపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దేశం చూపు మన వైపే

- సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం
- ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి
- బసిరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం

పరిగి: దేశం మొత్తం తెలంగాణ వైపే చూస్తోందని, ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బసిరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాయమాటలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని ఇల్లు అంటూ ఏదీ లేదన్నారు. ముచ్చటగా మూడో సారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చినట్లు తెలిపారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిప్రియ, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పలువురి చేరిక

పరిగి 8వ వార్డుకు చెందిన బీజేపీ నాయకులు, బసిరెడ్డిపల్లి, యాబాజిగూడ, చౌడాపూర్ మండిపాల్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆనంద్‌కు నిరసన సెగ

- అనర్హులకు దళితబంధు అంటూ ఆగ్రహం
- గ్రామంలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని నిలదీత
- నిరసనకారులను అడ్డుకున్న బీఆర్ఎస్ నేతలు
- మహిళలను వెనక్కు పంపిన పోలీసులు
- నాగారంలో ఉద్రిక్తత



నాగారంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దళితులు

ధారూరు: ''సారూ మేం కొట్లాడం.. మీకు పుణ్యం ఉంటుంది ఒక్కసారి ఎమ్మెల్యేతో మాట్లాడనివ్వండి'' అని దళిత మహిళలు పోలీసులను వేడుకున్నారు. ఈ ఘటన ధారూరు మండలం నాగారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నాగారం గ్రామానికి వచ్చారు. దళితబంధు లబ్ధిదారుల ఎంపిక, గ్రామ అభివృద్ధిపై నిలదీసేందుకు స్థానిక దళిత మహిళలు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని పసిగట్టిన బీఆర్ఎస్ నేతలు వారిని అడ్డుకున్నారు. ఎమ్మెల్యేతో నేను మాట్లాడిన తరువాత మీ అందరితో మాట్లాడిస్తానని బీఆర్ఎస్ నాయకుడు రాజేందర్‌రెడ్డి మహిళలకు సూచించారు. ఎమ్మెల్యే ప్రచారం చేసుకోవడానికి వచ్చారని, ఏదైనా ఉంటే తమతో మాట్లాడాలని ఎంపీటీసీ భర్త నరోత్తమ్‌రెడ్డి అన్నారు. అయితే ముందుగా ఎమ్మెల్యేకు మా బాధలు వివరిస్తామని అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షుడు సుకుమార్ తేల్చి చెప్పారు. పరిస్థితిని అంచనా వేసిన పోలీసులు మహిళలను అక్కడి నుంచి పంపించేందుకు యత్నించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని వచ్చామని, అయితే బీఆర్ఎస్ నాయకులు తమను అడ్డుకున్నారని అన్నారు. బీఆర్ఎస్ జెండా ఎవరు పట్టుకుంటే వారికే దళిత బంధు ఇస్తారా? అని నిలదీశారు. గ్రామంలో మీరు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పమని అడిగితే తప్పేంటని వారు ప్రశ్నించారు. భవనాలు, భూములు ఉన్నవారికే దళిత బంధుల ఇచ్చారని ఆరోపించారు. ముందుగా తమ ప్రశ్నలకు ఎమ్మెల్యే ఆనంద్ సమాధానం చెప్పాలని, ఆ తరువాతే గ్రామంలో ప్రచారం చేసుకోవాలని మహిళలు పట్టుబట్టారు. దీంతో వారిని, సుకుమార్‌ను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. అనంతరం ప్రచారం సాఫీగా సాగింది.

అభివృద్ధికి పట్టం కట్టండి

- ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం
- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కోరారు. మండలంలోని అంతారం, మోమిన్‌ఖుర్దు, మోమిన్‌కలాన్, రాజాపూర్, నాగారం, పీసీఎం తండా, గురుదోట్ల, అంపల్లి, దోర్నాల్, కుమ్మర్‌పల్లి, మైలారం, తరిగోపుల, నాగ్‌సాన్‌పల్లి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిన రౌడీ రాజ్యం మనకు వద్దని కాంగ్రెస్‌ను ఉద్దేశించి అన్నారు. కాంగ్రెస్ పాలనలో తాగునీటి కోసం కిలో మీటర్లు వెళ్లే వారిని, నేడు ఇంటి వద్దకే మిషన్ భగీరథ నల్లాలు వచ్చాయని అన్నారు. ఈ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మరోసారి తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను కాంగ్రెస్ పార్టీ ఆపాలని చూస్తోందని ఎమ్మెల్యే ఆనంద్, బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ తీరుకు నిరసనగా దోర్నాల్ గ్రామంలో ఆ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుబంధు డబ్బు ఆపాలని కాంగ్రెస్ ఎన్నికల కమిషన్‌ను కోరడం దారుణమన్నారు. ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుజాత, పార్టీ నాయకులు రవీందర్‌రెడ్డి, నందు, రాజునాయక్, వేణుగోపాల్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, వెంకటయ్య, బాల్‌రాజ్ నాయక్, దేవేందర్, నర్సింహులు, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

- నవంబర్ 14వ తేదీ వరకు గడువు

వికారాబాద్ అర్బన్: నవంబర్ 14వ తేదీ సాయంత్రంలోపు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలని ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి నవంబర్ 14వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. నవంబర్ 16 నుంచి 23వ తేదీ వరకు వంద రూపాయల అపరాధ రుసుంతో, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు రూ. 500 అపరాధ రుసుంతో, డిసెంబర్ 6 నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు రూ. 1000 అపరాధ రుసుంతో, డిసెంబర్ 15 నుంచి డిసెంబర్ 20వ తేదీ వరకు రూ. 2000 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

బీఆర్ఎస్‌కు తిరుగులేదు

- అభివృద్ధి, సంక్షేమ పథకాలే కొండంత అండ
- కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మడం లేదు
- మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



బీజేపీ నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

నవాబుపేట: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేదని, అభివృద్ధి, సంక్షేమ పథకాలే అభ్యర్థులకు కొండంత అండగా నిలుస్తాయని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పలువురు బీజేపీ నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదని ఆరోపించారు. దేశంలో ఎక్కడా తెలంగాణ తరహా పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. మాయమాటలు చెప్పే ఆ పార్టీల నాయకులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. అమలు కాని హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలకు, రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే యాదయ్యను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ మారితే నన్ను ఉరి తీయండి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

- డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి
- రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల పవనాలు
- హస్తం పార్టీలో పలువురి చేరిక

తాండూరు రూరల్: తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని, గెలిచిన తరువాత పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని, లేకుంటే ఆంజనేయస్వామి ఆలయం ముందు ఉరి తీయాలని డీసీసీబీ చైర్మన్, కాంగ్రెస్ నేత బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అంతారం, చెంగోల్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందన్నారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని తెలిపారు. ఆర్భాటంగా ప్రకటించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎంత మందికి ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తనను గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని అంతారం గ్రామానికి చెందిన మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్ మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా చెంగోల్ గ్రామ ఎంపీటీసీ రత్నమాల, రాము యాదవ్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, వీ శ్రీను, రాందాస్, గోపాల్‌రెడ్డి, అశోక్, ప్రవీణ్‌గౌడ్, రాంచంద్రారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ప్రకటించడం లాంఛనమే

తాండూరు: తాండూరు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తన పేరు ప్రకటించడం లాంఛనమేనని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్స్‌లో పార్టీ సీనియర్ నాయకులు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ జాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, పెద్దేముల్ మండల వైస్ ఎంపీపీ మధులతతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న తాండూరు నుంచి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రెండో విడత బస్సు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఆ కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అలీం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం తెస్తాం

- బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలి
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



మహిళలకు ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాల్సిన సమయం ఆసన్నమైందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రంగాపూర్, హనుమాన్‌గండి తండా, నజిరాబాద్, బసిరెడ్డిపల్లి, మదారం, పేటమాదారం, పోల్కంపల్లి గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, ఆ వెంటనే ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు అధికారాన్ని అడ్డు పెట్టుకొని కబ్జాలు చేశారని ఆరోపించారు. ధరణిని అడ్డుపెట్టుకొని ఎమ్మెల్యేలు భూములు ఆక్రమించారని అన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు చిన్న నర్సింహులు, శ్రీనివాస్, మాధవరెడ్డి, సర్వర్, ఖదీర్, నసీం, జగన్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

కాంగ్రెస్ పార్టీ విజయ భేరి రెండో విడత బస్సు యాత్రను విజయవంతం చేద్దామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ 28వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు తాండూరులో, సాయంత్రం 4గంటలకు పరిగిలో బస్సు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. 6 గంటలకు చేవెళ్లకు చేరుకుంటుందని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

దివ్యాంగ ఓటర్లకు అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్

బొంరాస్‌పేట: దివ్యాంగులు ఓటుహక్కు విని యోగించుకునే విధానంలో ప్రత్యేకత ఉంటుందని తహసీల్దార్ వెంకటేశ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో శారీరక దివ్యాంగ ఓటర్లకు పోలింగ్ విధానంలో కల్పించిన సౌకర్యాలపై ఆయన అవగాహన కల్పించారు. శారీరక దివ్యాంగులు పోలింగ్ రోజు వరుసలో నిలబడి ఇబ్బందులు ఎదుర్కోకుండా 12–డి ఫారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనిపై రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు వచ్చేశాయి



స్ట్రాంగ్‌రూమ్‌కు తాళం వేస్తున్న అధికారులు

కొడంగల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం పంపించిన ఈవీఎంలు (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్) గురువారం కొడంగల్‌కు వచ్చాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో వాటిని భద్రపరిచారు. అఖిల పక్ష నాయకుల సమక్షంలో అధికారులు ఈవీఎంలకు తాళం వేశారు. కొడంగల్ నియోజకవర్గపరిధిలో 8 మండలాలకు గాను 275 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. పోలింగ్ స్టేషన్లలో వినియోగించడానికి 343 కంట్రోల్ యూనిట్లు, 343 బ్యాలట్ యూనిట్లు, 385 వీవీ ప్యాట్లు (ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్) వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికలను జవాబుదారీగా పారదర్శకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ తెలిపారు. తహసీల్దార్ విజయకుమార్, సీఐ రాములు, డీటీ సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

మద్యం, కల్లు నిల్వల గుర్తింపు



కల్లును పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

అనంతగిరి: వికారాబాద్ ఎక్సైజ్ అధికారులు గురువారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కర్నాటక సరిహద్దు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా అక్రమ కల్లు నిల్వలు, మద్యం నిల్వలు, అనుమతి లేకుండా మద్యం అమ్మకాలు జరుపుతున్న దుకాణాలపై దాడులు చేసి 6 కేసులు నమోదు చేశామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్‌కుమార్ తెలిపారు. మొత్తం 1766 లీటర్ల కల్లును అక్కడే ధ్వంసం చేశామన్నారు. మద్యం సరఫరాలో చెకింగ్ చేపట్టగా మొత్తం 111 లిక్కర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మద్యం అక్రమ రవాణాను అణిచివేస్తామన్నారు.

రోడ్డెక్కిన రైతులు

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఆందోళన
- మరమ్మతులు చేయడంలేదని నిరసన
- పరిగి, కొడంగల్‌లో రోడ్డుపై బైఠాయింపు
- భారీగా ట్రాఫిక్ జామ్



పరిగి: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

పరిగి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నప్పటికీ నిత్యం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మత్తులకు గురవుతుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్లను బాగుచేయించేందుకు సబ్‌స్టేషన్‌కు తీసుకువెళ్తే అధికారుల నిర్లక్ష్యంతో అవి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో రోజుల తరబడి సబ్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విసుగుచెందిన రైతులు గురువారం పరిగి పట్టణంలోని సబ్‌స్టేషన్ ఎదుట హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించి విద్యుత్ అధికారుల తీరుపై నిరసన తెలిపారు. 20 రోజులుగా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని.. వాటిని మరమ్మతులకు తీసుకువస్తే అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు ఇస్తేనే విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేస్తున్నారని.. ఇవ్వని వారివి పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల ఆందోళనతో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినకపోవడంతో సంబంధిత విద్యుత్ అధికారులతో మాట్లాడించి సమస్య పరిష్కారానికి హామీ ఇప్పించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

కొడంగల్ సబ్‌స్టేషన్ ఎదుట..

కొడంగల్ రూరల్: విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్లు మాటిమాటికీ కాలిపోతూ వరి పంటలకు నీరందించలేక ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం పట్టణంలోని సబ్‌స్టేషన్ కార్యాలయ ఎదుట మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు నిరసన తెలిపారు. 13 రోజులుగా 5 పర్యాయాలు కాలిపోయాయని, ఇప్పటివరకు దాదాపు రూ.30వేలు ఖర్చయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతుల విషయమై సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగామని రైతులు అన్నారు. ఈ విషయాన్ని ఏడీఈ నవీన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ బిగించే ప్రాంతంలో ఎర్తింగ్ లేకపోవడంతో ఇలా జరిగి ఉంటుందని వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇకముందు ఇలాంటివి జరుగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

కాంగ్రెస్‌తోనే యువతకు ఉద్యోగాలు

కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి



ప్రచార రథంపై ప్రసంగిస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి, పక్కన వంశీచంద్‌రెడ్డి

తలకొండపల్లి: నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప–గడపకు కాంగ్రెస్‌లో భాగంగా నిర్వహించిన ప్రచారంలో కసిరెడ్డితో పాటు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజిసింగ్ హాజరయ్యారు. అనంతరం కసిరెడ్డి ఆధ్వర్యంలో వెల్జాల్ నుంచి కడ్తాల్ వరకు పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. పేపర్ లీకులు, కోర్టు తీర్పులతో ప్రభుత్వం పరీక్షలను రద్దుచేయడం, వాయిదా వేయడంతో నిరుద్యోగ యువతకు తీరని నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు సాగునీరు, విద్యార్థులకు నాణ్యమైన విద్య కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేస్తామన్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్సీ కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దశరథం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు అంజయ్యగుప్తా, రవీందర్‌యాదవ్, ఎంపీటీసీలు రమేష్, రఘునాయక్, రవీందర్‌యాదవ్, సోషల్ మీడియా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజీం, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాం, మండల ఎస్సీసెల్ చైర్మన్ చెన్నకేశవులు, సర్పంచ్‌లు వెంకట్రాంరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీశైలం, రేణురెడ్డి, కృష్ణ, డేవిడ్, యాదయ్యగౌడ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

దామగుండంలో చిరుత సంచారం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



గేదె కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

పూడూరు: దామగుండం అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు అప్రమతంగా ఉండాలని ఫారెస్టు జిల్లా అధికారి జ్ఞానేశ్వర్ సూచించారు. మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో మంగళవారం గేదెదూడను గుర్తుతెలియని జంతువు వేటాడటంతో అది మృత్యువాత పడింది. దీంతో బాధిత రైతు పులి తిని ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేయడంతో ఫారెస్టు అధికారులు అప్రమత్తం అయ్యారు. మొదట్లో వేట కుక్కలు వేటాడంతో గేదెదూడ మృతి చెందిందని నిర్ధారించారు. గ్రామస్తులు పులి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేయడంతో దామగుండం అటవీ ప్రాంతంలో అక్కడక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గురువారం తెల్లవారుఝామున చిరుతపులి సంచరిస్తున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. దీంతో దామగుండం అడవిలో చిరుత సంచరిస్తుందని అధికారులు నిర్ధారణకు వచ్చారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని పూడూరు గ్రామంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

- అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్త వేధింపులు
- కేసు నమోదు



వీరమణి (ఫైల్)

ధారూరు: అదనపు కట్నం కోసం భర్త, అత్త పెడుతున్న వేధింపులను భరించలేని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దేముల్ మండల పరిధిలోని గొట్లపల్లినికి చెందిన వీరమణి(30)ని మార్చి 16, 2017లో ధారూరుకి చెందిన జిక్కెపల్లి లాల్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.20వేల నగదు, 3 తులాల బంగారం, బడి బాసండ్లు ఇచ్చారు. అయితే వీరమణికి.. కార్తీక్(6), కృతిక(3) ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత ఇల్లు కట్టుకోడానికి అదనపు కట్నం తీసుకురావలంటూ అత్త లక్ష్మి, భర్త లాల్‌కుమార్ వేధించసాగారు. ఈ నేపథ్యంలో వీరమణి పుట్టింటివారు ఇంటి నిర్మాణానికి ఆగస్టు 30, 2020న రూ. 2.50 లక్షలు, 2021లో రెండోసారి రూ.3 లక్షలు ఇచ్చారు. డబ్బులు సరిపోలేవని భర్త, అత్త మరిన్ని డబ్బులు కావాలని డిమాండ్ చేయగా మూడు నెలల క్రితం వీరమణి అమ్మ మూడోసారి రూ.2.20 లక్షలు ఇచ్చింది. ఈనెల 24న కూతురు, అల్లుడు కలిసి దసరా పండుగ సందర్భంగా ఇంటికి వచ్చారని అత్త లక్ష్మి(మృతురాలి అమ్మ) పేర్కొంది. కొత్తకారు తీసుకున్నా డబ్బులు తక్కువపడ్డాయి, రూ.50 వేలు కావాలని అల్లుడు లాలుకుమార్ అత్త, బామ్మర్ది వెంకటేశ్‌ను డిమాండు చేశాడు. ప్రస్తుతం మా దగ్గర డబ్బులు లేవని తర్వాత ఇస్తామని చెప్పడంతో కోపోద్రిక్తుడైన లాల్‌కుమార్ ఉన్నపలంగా భార్యను తీసుకుని ఇంటికి వచ్చేసాడు. అదేరోజు రాత్రి భర్త, అత్త కలిసి వీరమణిని డబ్బులు తేవాలంటూ హింసించారు. వేధింపులు భరించలేని వీరమణి బుధవారం మధ్యాహ్నం చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని అదేరోజు మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అత్త, భర్త కలిసి తన కూతుర్ని అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా హింసించారని, ఆవేదన వ్యక్తం చేసింది. తన కూతురి భర్త, అత్తపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను వేడుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి శవానికి గురువారం పోస్టుమార్టమ్ చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు హ్యాట్రిక్ ఖాయం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



యాలాల: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

యాలాల: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు. యాలాల మండలం జుంటుపల్లికి చెందిన పలువురు యువకులు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో మరే రాష్ట్రం అమలు చేయడం లేదన్నారు. సీఎం కేసీఆర్ తాండూరు అభివృద్ధికి బాటలు వేశారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోమారు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పురుషోత్తంరావు, మాజీ వైస్ ఎంపీపీ రామారావు, గ్రామ ఉప సర్పంచ్ శేఖర్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శాంతప్ప, నాయకులు తదితరులు ఉన్నారు.

పట్టణంలో పైలట్ పాదయాత్ర

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణానికి చెందిన పలు వార్డుల పార్టీ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సన్నాహక సమావేశం నిర్వహించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఏనాడూ జరుగని రీతిలో తన హయాంలోనే తాండూరు పట్టణం అభివృద్ధి జరిగిందన్నారు. 27, 28, 29 తేదీల్లో పట్టణంలోని పలు వార్డుల్లో పాదయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం 8గంటలకు పాత తాండూరులోని శ్రీకోటేశ్వర దేవాలయం, నిజాం షాహీ దర్గాలో ప్రార్థనల అనంతరం పాదయాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మరింత అభివృద్ధి చేస్తా..

తాండూరు రూరల్: మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే తాండూరును మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి, బిజ్వార్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. నాయకులు రాజప్పగౌడ్, ఉమాశంకర్, రాంలింగారెడ్డి, నరేందర్‌రెడ్డి, మదన్ మోహన్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి..

పెద్దేముల్: రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్ మండల ఇందూరు, మంబాపూర్ గ్రామంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్ష్యంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. తాండూరులో మరోమారు బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామన్నారు. సర్పంచ్ శ్రావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలి..

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఎత్తులు వేస్తోందని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కర్నాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలనడం కాంగ్రెస్ పార్టీ విధానాలను అద్దం పడుతోందన్నారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్‌ను ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

రూ.5లక్షల నగదు పట్టివేత

మోమిన్‌పేట: మోమిన్‌పేటలో గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి బైక్‌పై రూ.5లక్షల నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. మోమిన్‌పేటకి చెందిన కృష్ణగౌడ్ ఎలాంటి ఆధారాలు చూపకుండా నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కోడ్ నిబంధనలకు లోబడే ఎవరైనా నగదు తీసుకెళ్లాలన్నారు. నగదుకు సంబంధించి పత్రాలు తప్పక చూపించాలన్నారు. లేనిపక్షంలో సీజ్ చేస్తామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మోమిన్‌పేట: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మోమిన్‌పేటలో గురువారం చోటుచేసుకొంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు.. మర్పల్లి మండలం బూచన్‌పల్లికి చెందిన నాగెడపల్లి లింగయ్య(55) మోమిన్‌పేటలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. లింగయ్య మోమిన్‌పేటలోని సంగమేశ్వర ఆలయ దగ్గర ఉన్న వెంచర్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఈనెల 17న డబుల్ డ్యూటీ చేయడంతో ఇంటికి రాలేదు. 18వ తేదీన ఉదయం భార్య కవిత ఫోన్ చేయగా జిల్లేడు పాలు తాగి నేను చనిపోతున్నాని పేర్కొనగా వెంటనే అక్కడికి చేరుకొని సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి లింగయ్య మృతి చెందాడు. మృతుడి కూతురు నక్షత్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

కాంట్రాక్టర్‌పై మేనేజర్ దాడి

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ శివారులో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)లో హెచ్‌ఆర్ మేనేజర్ అమిత్‌రంజన్ దురుసుగా ప్రవర్తించారు. బుధవారం సీసీఐ ఫ్యాక్టరీలో వంట కాంట్రాక్టర్‌గా పని చేస్తున్న కృష్ణపై అమిత్‌రంజన్ విచక్షణా రహితంగా దాడిచేశారు. ఈ సంఘటన సీసీఐ ఫ్యాక్టరీలో చర్చనీయంశంగా మారింది. ఈ విషయమై తాండూరు పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. హెచ్‌ఆర్ మేనేజన్ అమిత్‌రంజన్ మద్యం మత్తులో సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన సంఘటనలు చాలా ఉన్నాయని కార్మికులు చెప్పారు.

మహేశ్‌కు ఘన సన్మానం



మహేశ్‌ను సన్మానించిన ఉప్పల వెంకటేశ్

తలకొండపల్లి: కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన మహేశ్‌ను గురువారం మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ఘనంగా సన్మానించారు. వివరాలు.. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన మహేశ్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీలో శిక్షణ పొందాడు. కరాటేలో బ్లాక్‌బెల్టు సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 15 వరకు థర్డ్ ఇంటర్‌నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్–2023 కరాటే పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. కేశవ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీల్లో సెప్టెంబర్ 30న మహేష్ పాల్గొన్నాడు. ఆన్‌లైన్‌లో వారు అడిగిన ఈవెంట్‌లకు చక్కగా సమాధానమిచ్చాడు. కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని సాధించాడు. ఈ ఆన్‌లైన్ పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి 2000 మంది పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇద్దరు గోల్డ్ మెడల్స్ సాధించగా.. అందులో మహేశ్ ఒకరు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ గుట్టపైన మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ వెంకటేశ్.. మహేశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైతు బంధు మండల కోఆర్డినేటర్ నర్సింహ, గౌడ సంక్షేమ సంఘం కల్వకుర్తి తాలూకా కన్వీనర్ అశోక్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, కరాటే మాస్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. సతీష్

- కరాటేలో గోల్డ్‌మెడల్ కైవసం



మెడల్ అందుకుంటున్న సతీష్‌కుమార్‌గౌడ్

కద్తాల్: హైదరాబాద్‌లోని మాస్టర్ కేశవ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 26 వరకు నిర్వహించిన 3వ అంతర్జాతీయ ఆన్‌లైన్ ఈ–కాటా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండల పరిధిలోని ముద్వీన్‌కి చెందిన మాస్టర్ సతీష్‌కుమార్ ప్రతిభ చూపి గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. 18 సంవత్సరాలు పైబడిన కరాటే క్రీడకారులకు నిర్వహించిన ఆన్‌లైన్ ఈ–కాటా కరాటే పోటీలో దేశంలోని 28 రాష్ట్రాలకు చెందిన 2వేల మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నట్లు సతీష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఇందులో సతీష్‌కుమార్ కటాస్ అండ్ వెపన్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్, షీల్డ్, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈమేరకు గురువారం సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో కేశవ్ కరాటే అకాడమీ ఫౌండర్ మాస్టర్ కేశవ్, మాస్టర్ మహేశ్.. సతీష్‌కుమార్‌గౌడ్‌కు గోల్డ్‌మెడల్స్‌తో పాటు, షీల్డ్‌లు, ప్రశాంస పత్రాలు అందజేశారు. సతీష్‌కుమార్‌గౌడ్ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల ముద్వీన్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పంచాయతీ వ్యవస్థకు శ్రీకారం

- రాష్ట్రంలో తొలి పంచాయతీ సమితికి వేదికైన షాద్‌నగర్
- 1959 నవంబర్ 1న ప్రారంభించిన ప్రధాని నెహ్రూ
- ఆ అరుదైన రోజును స్మరించుకుంటున్న నేతలు



మండల పరిషత్ కార్యాలయంగా మారిన నాటి పంచాయతీ సమితి కార్యాలయం

షాద్‌నగర్: తలపై తెల్లని టోపీ.. ఎదపై ఎర్రని గులాబీ.. పెదవులపై చిరునవ్వు.. మదిలో పున్నమి పువ్వు.. చేతిలో పావురం.. మన జాతికి అతడే గోపురం.. అంటూ భారత జాతి కొనియాడే చాచా నెహ్రూ చల్లని అడుగులతో ఈనేల పులకించింది. ప్రతి ఒక్కరికి మరపురాని అనుభూతిని మిగిల్చింది. తొలి పంచాయతీ సమితి ఏర్పాటు సందర్భంగా షాద్‌నగర్ వాసుల అనుభవాలు ఇవి. షాద్‌నగర్ నియోజకవర్గానికే వన్నె తెచ్చి దేశం యావత్తు ఇటువైపు చూసేలా చేసిన ఆనాటి మధురస్మృతులను ఓసారి గుర్తుకు చేసుకుంటే..

ప్రారంభించిన ప్రధాని నెహ్రూ..

పరిపాలన వికేంద్రీరణతోనే దేశంలో పాలన సమర్థవంతంగా సాగుతుందని భావించిన బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు ప్రజల భాగస్వామ్యం అనే అంశంతో మూడంచెల విధానాన్ని సిఫారసు చేసింది. 1958లో ఈ విధానాన్ని జాతీయ అభివృద్ధి మండలి ఆమోదించింది. ఇందులో గ్రామ పంచాయితీల ఏర్పాటు, దాని విధివిధానాలను పేర్కొంది. దీంతో 1959 అక్టోబర్ 2న మూడంచెల విధానాన్ని దేశంలో తొలిసారిగా రాజస్థాన్ రాష్ట్రంలోని నాగౌర్ జిల్లాలో అమలు చేశారు. అదే సంవత్సరం నవంబర్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ వ్యవస్థను అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఉన్న షాద్‌నగర్‌లో తొలిసారిగా అప్పటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ లాంఛనంగా ప్రారంభించారు. నూతన స్థానిక సంస్థల విధానం మొదట తెలంగాణలోనే అమలైంది. మూడంచెల విధానం అమలు చేసిన రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండోది కాగా అది షాద్‌నగర్‌లో ప్రారంభం కావడం విశేషం.

ఇవీ అడుగులు..

అది 1959 నవంబర్ 1 తేదీ.. దేశంలో రెండవది, రాష్ట్రంలోనే మొదటిదైన పంచాయతీ సమితిని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రి హోదాలో ప్రారంభించేందుకు షాద్‌నగర్‌కు వచ్చారు. నెహ్రూ ఎప్పుడు వస్తారా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓ వృద్ధుడి భుజంపై చెయ్యి పడింది. ఎవరని వెనక్కి తిరిగి చూస్తే చాచా నెహ్రూ. అతనితో మాట్లాడుకుంటూ మెల్లగా నడుచుకుంటూ ఆయన వేదిక వద్దకు వచ్చారు. అదే వేదిక పైన తర్వాత ప్రధానులైన ఇందిరాగాంధీ, పీవీ నర్సింహారావు ఉన్నారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు నెహ్రూకు ఘన స్వాగతం పలికారు. నెహ్రూ హిందీలో చేసిన ప్రసంగాన్ని పీవీ నర్సింహారావు తెలుగులో అనువాదం చేశారు. ఇప్పటి అంబేడ్కర్ కాలనీలో అప్పట్లో ఏర్పాటు చేసిన వేదికపై ఆయన ప్రసంగాన్ని కొనసాగించారు. అంతేకాందు అప్పటి బ్లాక్‌గా ఏర్పాటు చేసిన ఇప్పటి మండల పరిషత్‌లో పార్కు మధ్యలో నీటిని చిమ్మే తారమ కొలను, ఎదురుగా సాంస్కృతిక ప్రదర్శనల నిమిత్తం కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. మండల పరిషత్ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రస్తుత మండల పరిషత్ కార్యాలయమే అప్పటి పంచాయతీ సమితి కార్యాలయం. తొలి పంచాయతీ సమితి అధ్యక్షుడిగా కొత్తూరు మండలం అప్పారెడ్డిగూడనికి చెందిన రాందేవ్‌రెడ్డి ఎన్నికయ్యారు.

ప్రధాని ప్రసంగం సాగిందిలా..

ప్రజలే నిజమైన ప్రభువులు, మనం వారికి సేవకులం మాత్రమే అని ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అంతేకాదు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ప్రజలను మమేకం చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలతో శ్రమదానం నిర్వహించారు. నాటి నుంచి 1984 వరకు పంచాయతీ సమితి ఆదర్శవంతంగా కొనసాగింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ పార్టీ మండలాల వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పంచాయతీ సమితులు రద్దయ్యాయి. నాటి పంచాయతీ సమితి భవనమే ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయంగా కొనసాగుతుంది. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో మళ్లీ నిర్మించారు. తాలుకాగా ఉన్న షాద్‌నగర్ ప్రాంతాన్ని నాలుగు మండలాలుగా విభజించారు. ఫరూఖ్‌నగర్, కొత్తూరు, కేశంపేట, కొందుర్గు అప్పట్లో మండలాలుగా ఏర్పాటు అయ్యాయి. పరిపాలన సౌలభ్యం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండేళ్ల క్రితం కొత్తగా నందిగామ, చౌదరిగూడ మండలాలను ఏర్పాటు చేసింది. అతి పెద్ద ఆవరణలో ఉన్న ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు పచ్చదనం నీడలో ఉన్నాయంటే ఇది ఆనాటి పుణ్యమే. అందుకే అరుదైన ఆ రోజును ప్రత్యక్షంగా వీక్షించిన పెద్దలు నేటికీ గుర్తు చేసుకుంటారు. నేతలు కూడా ఆరోజును నెమరువేసుకుంటున్నారు.